గోడ పాయే.. డ్రోన్సూ పాయే

- రూ. 40లక్షలకు పైగా ప్రజాధనం వృధా
- డ్రోన్ షోకు అడ్డొస్తుందని అప్‌కాస్ట్ సరిహద్దు గోడ కూల్చివేత
- అయిపోగానే కడతామన్న అధికారులు పత్తా లేరు

భవానీపురం(విజయవాడపశ్చిమ): 'కోడి బాయె లచ్చమ్మదీ.. కోడి పుంజు బాయె లచ్చమ్మదీ..' అన్న చందన 'గోడ పాయె సైన్స్ సెంటర్‌దీ.. డ్రోన్స్ పాయె ప్రభుత్వానిదీ' అని పాడుకుంటున్నారు స్థానికులు. విజయవాడ కృష్ణానదీ తీరాన భవానీపురం పున్నమిఘాట్‌లో గత ఏడాది అక్టోబర్ నెల 22వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ షో నిర్వహించింది. అయితే డ్రోన్ షోకు అడ్డొస్తుందని ప్రభుత్వ సంస్థకు చెందిన సరిహద్దు గోడను అధికారులు కూల్చేశారు. అదేమని అడిగితే కార్యక్రమం అయిపోగానే కట్టేస్తాంలే అని అధికారులు అప్పటికి సర్దిచెప్పేశారు. అంతే డ్రోన్ షో ముగిసింది, అధికారులు మూటముల్లె సర్దుకుని ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. కార్యక్రమం జరిగి మూడు నెలలయినా ఆ విధంగా చెప్పిన అధికారులు పత్తా లేకుండా పోయారు. ఇటు సైన్స్ సెంటర్ సరిహద్దు గోడ కూల్చివేసి తిరిగి నిర్మించకపోగా అటు భారీ ఎత్తున ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆవిష్కరించిన డ్రోన్స్ ఎక్కడ ఉన్నాయో.. ఎందుకు ఉపయోగిస్తున్నారో అర్థం కాని పరిస్థితి.

ఆక్రమణకు గురయ్యే అవకాశం

సరిహద్దు గోడ లేకపోవడంతో స్థానికులు గ్రౌండ్‌ను యథేచ్ఛగా వాడేసుకుంటున్నారు. కొన్నాళ్లు ఇలానే ఉంటే తిరిగి కబ్జాకు గురైనా ఆశ్చర్య పోనక్కర్లేదని స్థానికులు చెబుతున్నారు. పట్టించుకోవాల్సిన గోడ కూల్చేసిన ప్రభుత్వ సంస్థ అధికారులు గానీ, అప్‌కాస్ట్ అధికారులు గానీ మిన్నకుండా ఉండిపోయారు. భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోని పున్నమిఘాట్‌కు ఆనుకుని ఆక్రమణకు గురైన సుమారు ఎకరంపైగా ఉన్న ఖాళీ స్థలాన్ని అప్‌కాస్ట్ గత మెంబర్ సెక్రటరీ డాక్టర్ వై. అపర్ణ ప్రభుత్వ అధికారులతో సర్వే చేయించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థలం సరిహద్దుల ప్రకారం సుమారు రూ. 40 లక్షలకుపైగా ఖర్చు పెట్టి ప్రహరీ గోడ నిర్మించారు.


సైన్స్ సెంటర్ ఆవరణలో కూల్చేసిన సరిహద్దు గోడ శిథిలాలు

అత్యుత్సాహంతో కూల్చేసిన అధికారులు

డ్రోన్ షోలో భాగంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు అడ్డు వస్తుందని అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్‌కు చెందిన సరిహద్దు గోడను కూల్చివేశారు. అయితే అప్‌కాస్ట్ సరిహద్దుకు వెనుక (పున్నమిఘాట్ లోపల) ప్రైవేట్ వ్యక్తుల స్థలం ఉండటంతో అందులోకి వెళ్లే దారి లేకుండా ప్రహరీ నిర్మించడంపై వారు అభ్యంతరం తెలుపుతూ కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం అది కోర్టు వివాదంలో ఉంది. ఈ క్రమంలోనే అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్ నిర్మించిన సరిహద్దు గోడ కార్యక్రమాలకు అడ్డు వస్తుందన్న కారణంగా గత అక్టోబర్ 19వ తేదీ రాత్రి సమయంలో జేసీబీతో కూల్చివేశారు. కూల్చేసిన శిథిలాలను తిరిగి అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్ ఆవరణలోనే పడేయడం గమనార్హం. అయితే ప్రభుత్వం నిర్వహించే డ్రోన్ షో కాబట్టి అధికారులు ఎవరి అనుమతి తీసుకోకుండానే అత్యుత్సాహంతో సరిహద్దు గోడను కూల్చేశారు. వాస్తవానికి సుమారు ఆరు అడుగుల ఎత్తులో ఉన్న సరిహద్దు గోడ డ్రోన్ షోకుగానీ, సాంస్కృతిక ప్రదర్శనలకు గానీ అడ్డంకి కాదు. ఎందుకంటే డ్రోన్ అనేది ఎత్తులోనే ఎగురుతుంది కాబట్టి..


కూల్చేసిన అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్ సరిహద్దు గోడ ప్రాంతం

పట్టించుకునే నాథుడు లేడు

సరిహద్దు గోడ కూల్చేసి మూడు నెలలు అయినా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో సమస్య అలానే ఉండి పోయింది. అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్ మెంబర్ సెక్రటరీగానీ, ఇక్కడ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఏఓ గానీ తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అటవీ, విద్యుత్, పర్యావరణ శాఖ పరిధిలోని అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్ అభివృద్ధిపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సరిహద్దు గోడ పునఃనిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. లేని పక్షంలో ఎంతో కష్టపడి పరాధీనంలో ఉన్న ఎకరానికి పైగా స్థలాన్ని స్వాధీనం చేసుకున్నది తిరిగి కబ్జాకు గురైనా ఆశ్చర్యపడనక్కర్లేదని వ్యాఖ్యానిస్తున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో రద్దీ


సూర్యోపాసన సేవ


అంతరాలయం వద్ద భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భీష్మ ఏకాదశి, రెండో శనివారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగింది. భీష్మ ఏకాదశి నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో క్యూలైన్లలో రద్దీ కనిపించింది. నూతన వధూవరులు పెళ్లి దుస్తులపై ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పెళ్లి బట్టలపై వచ్చిన నూతన వధూవరులకు ఉచితంగా అంతరాలయ దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు. అమ్మవారికి తెల్లవారుజామున నిర్వహించిన ఖడ్గమాలార్చనలో 22 మంది, చండీ హోమంలో 67 మంది, లక్ష కుంకుమార్చనలో 8 మంది, శ్రీచక్రనవార్చనలో 9 మంది, ఇతర సేవల్లో 330 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. రద్దీ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షించారు. సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ, పంచహారతుల సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధ్వజారోహణ మహోత్సవాన్ని అర్చకస్వాములు శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం యజ్ఞశాల ప్రవేశం, వాస్తుపూజ, అగ్ని ఆరాధన తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్యంగా ఆలయ ప్రాంగణంలో పలు ప్రత్యేక హోమాలను జరిగాయి. అనంతరం బ్రహ్మోత్సవాలకు సకల దేవతాలను ఆహ్వానిస్తూ ధ్వజ స్తంభానికి గరుడ పటాన్ని ముద్రించిన పతాకాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ స్వామివారి ఉత్సవానికి దేవతామూర్తులను ఆహ్వానించడమే ఇందులో పరమార్థమన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారిని దర్శించుకోవడం అత్యంత శుభ ఫలితాన్ని అందిస్తుందని చెప్పారు. అదేవిధంగా భీష్మ ఏకాదశి పర్వదినం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా శేషవాహన సేవ

ఉత్సవాల్లో భాగంగా స్వామివారి శేషవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని శేషవాహనాన్ని రమణీయంగా అలంకరించారు. అందులో ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని అధిష్టింపజేసి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.


శేషవాహన సేవలో స్వామివారు

గుణదల ఉత్సవాలలో నేటి కార్యక్రమాలు

ఉదయం - 7.00 గంటలకు - ఉత్సవాల ప్రారంభం, తొలి దివ్యబలిపూజ.
10.00 గంటలకు - పవిత్రాత్మ నూత్నీకరణ ప్రార్థనలు.
10.30 గంటలకు - సాంస్కృతిక కార్యక్రమాలు.
11.30 గంటలకు - దివ్యబలి పూజ దేవాలయము నందు.
11.30 గంటలకు - కోలాటం బిషప్ గ్రాసి ప్రాంగణంలో.
మధ్యాహ్నం - 12.30 గంటలకు - సాంస్కృతిక కార్యక్రమాలు.
1.30 గంటలకు - కోలాటం.
3.00 గంటలకు - గుణదల మాత ఊరేగింపు.
సాయంత్రం - 5.15 గంటలకు - జపమాల.
6.00 గంటలకు - సమష్టి దివ్యబలి పూజ.
రాత్రి - 8.30 గంటలకు - సాంస్కృతిక కార్యక్రమాలు.
9.30 గంటలకు - గానమంజరి(భక్తి గీతాలు).
10.30 గంటలకు - సృష్టి యేసయ్య (బుర్రకథ).
11.30 గంటలకు - శిలువధారి (నాటకం).
1.30 గంటలకు - యేసేబు విజయం (నాటకం)



14 నుంచి ఆహాలో డ్యాన్స్ ఐకాన్ సీజన్-2



లబ్బీపేట(విజయవాడతూర్పు): డాన్స్ లవర్స్‌ను మెస్మరైజ్ చేసిన డ్యాన్స్ ఐకాన్ సీజన్-1కు కొనసాగింపుగా డ్యాన్స్ ఐకాన్ సీజన్ -2 వైల్డ్ ఫైర్ ఈ నెల 14 నుంచి ఆహా ఓటీటీలో ప్రీమియర్‌కు రెడీ అయిందని ప్రముఖ యాంకర్, దర్శకుడు, డాన్స్ ఐకాన్ సీజన్ 2 హోస్ట్ ఓంకార్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో డాన్స్ ఐకాన్-2 టీం శనివారం మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఓంకార్ మాట్లాడుతూ డ్యాన్స్ ఐకాన్ 2 వైల్డ్ ఫైర్‌కు హీరోయిన్ ఫరియా అబ్దుల్లా హోస్ట్‌గా చేస్తుండటం సంతోషంగా ఉందన్నారు. శేఖర్ మాస్టర్ సెకండ్ టైమ్ ఈ షోకు జడ్జిగా వ్యవహరిస్తున్నారన్నారు. డ్యాన్స్ ఐకాన్- 2 వైల్డ్ ఫైర్‌లో ఐదుగురు కంటెస్టెంట్స్ సర్‌ప్రైజ్ చేస్తారని చెప్పారు. సమావేశంలో డ్యాన్స్ ఐకాన్-2 మెంటార్స్ మానస్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

9 కేజీల గంజాయి పట్టివేత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం అరెస్ట్ చేశారు. అజిత్‌సింగ్ నగర్ పోలీసుల కథనం మేరకు..సింగ్‌నగర్ నందమూరినగర్ ప్రాంతంలో నివసిస్తున్న యోగానంద సునీత అనే మహిళ ఇంట్లో గంజాయి ఉన్నట్లుగా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించగా తొమ్మిది కేజీల గంజాయి లభ్యమైంది. చేబ్రోలు నవీన్ అనే యువకుడితో కలిసి ఆమె అమలాపురం నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిపింది. పోలీసులు నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్కంపూడి కాలనీకి చెందిన షేక్ జుబేదా నూజివీడుకు చెందిన కుంభ తేజను ప్రేమ వివాహం చేసుకుంది. కొంత కాలం కిందట భార్యభర్తల మధ్య విభేదాలు రావడంతో జుబేదా పుట్టింటికి వచ్చేసింది. శుక్రవారం జుబేదా తల్లిదండ్రులు, బంధువులు తేజ ఇంటికి వెళ్లి మాట్లాడాలని నిర్ణయించుకున్నారు. అయితే అదే సమయంలో జుబేదా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తేజను జుబేదా గురించి ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో తల్లి ఆషా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా సినీనటి భానుమతి శత జయంతి



విజయవాడ కల్చరల్: నవరస నటీమణి సినీ నటి భానుమతి అని సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు అన్నారు. సంగీత సమ్రాట్ కళా సంస్థ, కేవీ బ్రహ్మానందరావు కళాసమితి, తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సినీ నటి, దర్శకురాలు, నిర్మాత పీ భానుమతి శత జయంతి వేడుకలు, భక్తి సంగీతం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మానందరావు మాట్లాడుతూ తెలుగు వారు గర్వించతగిన సంగీత విద్వాంసురాలు, నటి భానుమతి అన్నారు. ఆమె పలు భారతీయ భాషల్లో నటించినట్లు తెలిపారు. సంగీత దర్శకుడు కేవీ విద్యాసాగర్, సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్, గాయకుడు ఆకురాతి కోదండ రామయ్య, గోళ్ళ నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్ సంగీత విద్వాంసురాలు మహేంద్రవాడ లక్ష్మీరామ దాసు సంగీత సేవలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఆమెను అతిథులు ఆత్మీయంగా సత్కరించారు. కేవీపీ విద్యాసాగర్, కేవీ ఆనంద్ భక్తి గీతాలను నగరానికి చెందిన గాయనీ గాయకులు భక్తి గీతాలను ఆలపించారు. కేఎస్ పూర్ణచంద్రిక నిర్వహించారు.

క్లుప్తంగా

శ్రీ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీష్మ ఏకాదశి నేపథ్యంలో చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ, అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తికి ఆలయ అర్చకుడు రామరత్నమాచార్యులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని, మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారికి తులసీ మాలను సమర్పించి పూజలు జరిపించుకున్నారు. సాయంత్రం స్వామివారికి పంచహారతులు, ఏకాంత సేవలను నిర్వహించారు.

12న సిద్ధార్థ ఆడిటోరియంలో సియన్నియా



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): శాస్త్ర విజ్ఞానాన్ని యువతరంలో వ్యాప్తి చేయడానికి సీయన్నియా పేరుతో ఈ నెల 12వ తేదీన సిద్ధార్థ ఆడిటోరియంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సిద్ధార్థ కళాశాల వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, జీవసాంకేతిక శాస్త్ర విభాగాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. క్విజ్, పీపీపీ, అరుదైన జీవజాల సమాచార ప్రదర్శన, మిస్టర్ అండ్ మిస్ బయో మెదలైన పోటీలను నిర్వహిస్తామని వివరించారు. ఎన్టీఆర్, కృష్ణా, ఉభయ గోదావరి, గుంటూరు జిల్లాల నుంచి డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల, వృక్ష శాస్త్రాధిపతి డాక్టర్ పువ్వాడ శ్రీనివాసరావు, కార్యక్రమం కో-కన్వీనర్ డాక్టర్ సాంబానాయక్, అధ్యాపకులు డి.శ్రావణి, సీహెచ్ శిరీష, పి.లలితా ప్రియాంకతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.

యువ నటులకు ప్రోత్సాహం ఇవ్వాలి



విజయవాడ కల్చరల్: యువ నటులలోని ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహం ఇవ్వాలని సుమధుర కళానికేతన్ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు అన్నారు. సుమధుర కళానికేతన్ ఆధ్వర్యంలో 51వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ హాస్యనాటికల పోటీలు శనివారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసరాజు మాట్లాడుతూ నాటకం భవిష్యత్ యువ నటీనటులతోనే సాధ్యమన్నారు. పౌరాణిక, సాంఘిక నాటకాల్లో ప్రతిభను చూపిస్తున్న యువ నటులు సాయి శంకర్, బీ రూపాశ్రీలకు శనగల కబీర్‌దాస్ స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, దేవినేని కిషోర్‌కుమార్, డాక్టర్ పూర్ణానందం, సాంస్కృతిక సంస్థల ప్రతినిధి సామంతపూడి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు. తొలినాటికగా ఈవీఎస్ కళా సమితి విజయవాడ వారి దంతవేదాంతం నాటికను ప్రదర్శించారు. పొరబాటున విషం కలిపిన కాఫీ తామే తాగివుంటామని కుటుంబ సభ్యులు బంధువులు భయంతో అల్లాడటం. పరీక్షించడానికి వచ్చిన డాక్టర్ కూడా తాను కూడా విషం తాగానని భ్రమపడటం చివరకు అది విషం కాదని తెలియడంతో కథ సుఖాంతమవుతుంది. రెండవ నాటికగా మా ఇంట్లో మహాభారతం, నాటికను మూడవ నాటికగా దొందూ దొందే నాటికను ప్రదర్శించారు.

బహుముఖ ప్రతిభాశాలి గుడిపాటి

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి గుడిపాటి శ్రీరామమూర్తి అని సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్ అన్నారు. గుడిపాటి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో శనివారం సంగీత విద్వాంసుడు హరికథా భాగవతార్ గుడిపాటి శ్రీరామమూర్తి 118వ జయంతి వేడుకలు, హరికథా గానం కార్యక్రమం నిర్వహించారు. గౌరీనాథ్ మాట్లాడుతూ హరికథా సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని అన్నారు. విఖ్యాత హరికథా భాగవతారిణి మోపిదేవి దుర్గామహాలక్ష్మి భాగవతారిణి మాట్లాడుతూ గుడిపాటి సంగీత సాహిత్య సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గుడిపాటి కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు గుడిపాటి జయరాం సుధాకర్ సంస్థ లక్ష్యాలను వివరించారు. గుడిపాటి దత్తు, చివుకుల హరగోపాల్ పాల్గొన్నారు. హరికథా భాగవతార్ బుర్రాపద్మనాభ శాస్త్రిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. పద్మనాభశాస్త్రి, సుందరాకాండ పారాయణం చేశారు.

ఐ డొనేషన్ క్యాంపులు ప్రోత్సహించాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యాంటీ నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆర్.కె.రవికృష్ణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): అంధత్వ నిర్మూలనకు ఐ డొనేషన్ క్యాంపులను విరివిగా ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని యాంటీ నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆర్.కె. రవికృష్ణ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 5వ రాష్ట్ర మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీంద్రబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల చట్టం-2016, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నియమాలు-2023 తెలుగులోకి అనువదించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విభిన్న ప్రతిభావంతులైన వారిలో మట్టిలో మాణిక్యాలను గుర్తించి రాబోయే 10 సంవత్సరాలలో సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యే విధంగా తన వంతు పాత్ర పోషిస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్. సూర్య నారాయణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాడే విషయంలో ఈ అసోసియేషన్ రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలన్నింటికి స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ఎన్నో ప్రభుత్వ ఉత్తర్వులను పోరాడి సాధించుకోవడంతో పాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ సంఘాలతో పోరాడటంలో కూడా ముందు నిలుస్తోందని కొనియాడారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీంద్రబాబు మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా తమ అసోసియేషన్ అంధులైన ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాడి ఎన్నో విజయాలను సాధించిందన్నారు. ఈ సందర్భంగా అర్జున్ అవార్డు గ్రహీత భారత అంధుల క్రికెట్ కెప్టెన్ ఐ.అజయ్‌కుమార్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగుల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి బాజీ పటాన్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎం.వి. రంగారావు, సెక్రటరీ జమలయ్య, రాయలసీమ రీజియన్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్లు శారదారాణి, సబితా రాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై తీర్పు రాజ్యాంగ విరుద్ధం

- రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీ
- బహుజన రాజకీయ పార్టీల ఐక్యవేదిక


చర్చావేదికలో పాల్గొన్న బహుజన పార్టీల నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని వక్తలు విమర్శించారు. దేశంలో ఆరెస్సెస్ రాజ్యాంగం అమలుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువడిందన్నారు. శనివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో బహుజన రాజకీయ పార్టీల జేఏసీ ఆధ్వర్యంలో చర్చా వేదిక జరిగింది. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ వేదిక తీర్మానించింది. చర్చావేదికలో పాల్గొన్న వేదిక కన్వీనర్ జై భీమ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు నుంచి మున్సిఫ్ కోర్టుల వరకు అన్నీ కాషాయమయం అయ్యాయన్నారు. వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చి ఒక రాష్ట్ర సమస్యను దేశ వ్యాప్త సమస్య చేసిందన్నారు. కులాల మధ్యచిచ్చు పెట్టిందన్నారు. అంబేడ్కర్ ఆశించిన బడుగుల ఐక్యతను దెబ్బతీస్తున్నారన్నారు. ఆంధ్ర బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు పంతగాని రమేష్ మాట్లాడుతూ ఎస్సీ కులాల వర్గీకరణ కేసులో సుప్రీం కోర్ట్ అతి దారుణమైన తప్పు చేసిందన్నారు. ఈ తీర్పు ప్రెసిడెన్షియల్ ఆర్డర్, రాజ్యాంగానికి వ్యతిరేకమని అన్నారు. ఈ తీర్పును వ్యతిరేకిస్తున్నామన్నారు. దళితులను చీల్చే తీర్పు వెలువరించిందన్నారు. భవిష్యత్తులో వాళ్ల రాజకీయ శక్తిగా ఎదిగే అవకాశం లేకుండా కుట్ర జరుగుతోందన్నారు. ఎల్‌జేడీ నాయకులు బూరుగు రత్నం మాట్లాడుతూ వర్గీకరణపై ప్రధానమంత్రి చెప్పినట్లుగా ఇచ్చిన తీర్పని విమర్శించారు. ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణ వంటి విషయాలపై పార్లమెంట్‌కు మాత్రమే అధికారం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ జరపడానికి వీల్లేదన్నారు. వేదికలో మహాజన రాజ్యం పార్టీ నాయకులు సంఘటి మనోహర్, జై భీమ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డేనియల్, సోషల్ డెమొక్రటిక్ పార్టీ నాయకులు సత్తార్, దళిత సంక్షేమ పార్టీ నాయకులు తవనం భూషణం, చల్లా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగదర్శిని సేవలను వినియోగించుకోవాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజన్ ఫౌండేషన్ ఉద్యోగ దర్శిని పేరుతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు అందిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. విజన్ ఫౌండేషన్ ముద్రించిన ఉద్యోగ దర్శిని పోస్టర్‌ను శనివారం తన కార్యాలయంలో మంత్రి సత్యకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా విజన్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ జి.విజయకుమార్ మాట్లాడుతూ తమ సంస్థ పేద, మధ్య తరగతి విద్యార్థులకు బ్యాంకు పరీక్షలు, ఎస్ఎస్‌సీ, ఆర్పీ, ఆర్ఆర్‌బీ, ఎల్ఐసీ, పోలీసు, వీఆర్వో, సచివాలయ ఉద్యోగాల తదితర పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సెలవుపై కొత్తపేట సీఐ.?

ఎమ్మెల్యే తీరే కారణమా..!

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట సీఐ చిన కొండలరావు సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది. దీనికి స్టేషన్ పరిధిలోని అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ స్థల వివాదమే సీఐ సెలవుపై వెళ్లడానికి కారణమని పోలీసు వర్గాల్లో చర్చ సాగుతోంది. అంబాపురం పరిధిలోని ఓ కాలనీకి చెందిన స్థలంపై కొంత కాలంగా వివాదం చోటు చేసుకుంది. దీనిపై ఓ వర్గం పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ కొండలరావు కేసు నమోదు చేశారు. ఈ వివాదంపై కృష్ణాజిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే సీఐ చిన కొండలరావుల మధ్య శుక్రవారం రాత్రి ఫోన్ సంభాషణ జరిగినట్లు స్టేషన్‌లో సిబ్బంది పేర్కొంటున్నారు. అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే నోటి దురుసుతనం వల్ల తీవ్ర మనస్థాపానికి గురైన సీఐ శుక్రవారం రాత్రి తన జీప్‌ను స్టేషన్ వద్దే వదిలి తన సొంత వాహనంపై ఇంటికి వెళ్లిపోయినట్లు సమాచారం. సీఐని నోటికి వచ్చినట్లు ఎమ్మెల్యే మాట్లాడినట్లు పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం కొత్తపేట స్టేషన్‌కు ఎవరికి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించలేదని సమాచారం. శనివారం సీఐ కొండలరావు స్టేషన్‌కు రాకపోవడంతో పోలీసు అధికారులు అతని ఫోన్‌లో మాట్లాడేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తుంది. అయితే ఫోన్‌స్విచ్ ఆఫ్ రావడంతో ఉన్నతాధికారులకు తెలియజేశారు. సీఐ స్థాయి అధికారిని ఎమ్మెల్యే ఈ విధంగా ఇబ్బందులకు గురి చేస్తే భవిష్యత్తులో పోలీసు సిబ్బంది ఏ విధంగా పని చేస్తారని కొత్తపేట సిబ్బంది బహిరంగంగానే పేర్కొంటున్నారు. ఇప్పటికే పేకాట, కోడి పందెలపై దాడులు నిర్వహిస్తే వారిని స్టేషన్‌కు తీసుకువచ్చే లోగానే కూటమి నేతలు ఫోన్ చేసి పలానా వారిని వదిలేయాలని బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని పోలీస్‌స్టేషన్‌లో జోరుగా ప్రచారం సాగుతోంది.